
సాక్షి
అనంతపురం

మంగళవారం । 7 । నవంబర్ । 2023



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



టమాట కిలో రూ.23

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/22.4°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. తూర్పు దిశగా గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

కరువు సహాయక చర్యలు చేపట్టండి



కలెక్టరేట్ నుంచి హాజరైన కలెక్టర్ గౌతమి

అనంతపురం అగ్రికల్చర్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమి ఓ ప్రకటనలో ఆదేశించారు. జిల్లాలో బెళుగుప్ప, బొమ్మనహాళ్, యల్లనూరు మినహా మిగతా 28 మండలాలను కరువు జాబితాలో చేర్చారన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖలు, ఇతరత్ర కరువు సంబంధిత శాఖలు సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా అర్హత కలిగిన రైతులకు సహాయక చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. మున్సిపల్, పట్టణ ప్రాంతాలు, శాశ్వత సాగు నీటి సదుపాయం కలిగిన ప్రాంతాలు మినహా మిగతా అన్ని ప్రాంతాల్లో కరువు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందాలి

అనంతపురం అర్బన్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాల ద్వారా సిఫార్సు చేసిన రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. 'ఆరోగ్య సురక్ష'పై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతపురం నుంచి కలెక్టర్ గౌతమితో పాటు ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరావు, డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 516 'ఆరోగ్య సురక్ష' శిబిరాలు నిర్వహించామన్నారు. మిగిలిన శిబిరాలు సజావుగా నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి, ఎంప్యానల్ అయిన ఆస్పత్రులకు రెఫరల్ చేసిన కేసులను దగ్గరుండి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలని చెప్పారు. సమావేశంలో సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు, డీఐఓ యుగంధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి చూపాలి

జిల్లాలో ఇళ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల లక్ష్యాలను చేరుకోవడంలో పురోగతి చూపాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అంశాలపై సమీక్షించారు. వివిధ దశలో ఉన్న 7,072 ఇళ్ల నిర్మాణం నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం ఏ మేరకు లబ్ధి పొందింది, గ్రామాల్లో ఏస్థాయిలో అభివృద్ధి జరిగిందనే విషయాల గురించి ప్రతి సచివాలయం పరిధిలో ఈ నెల 9 నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

20 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 20 మండలాల పరిధిలో వర్షం కురిసింది. 8.5 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. కాగా రాగల రెండు రోజులు జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

అర్జీలపై జాప్యం వద్దు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వకూడదని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, ఆనంద్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 363 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. ప్రజల నుంచి అందే ప్రతి అర్జీకీ ప్రాధాన్యత ఇవ్వాలని జేసీ సూచించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు.

నేడు పుట్టపర్తికి సీఎం



సీఎం సభ కోసం పుట్టపర్తిలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సమీపంలోని క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు

- 'రైతు భరోసా' ఐదో ఏడాది రెండో విడత నిధుల విడుదల
- సీఎం హోదాలో తొలిసారి పుట్టపర్తికి వస్తున్న వైనం

సాక్షి, పుట్టపర్తి : శ్రీసత్యసాయి జిల్లా ఆవిర్భావం తర్వాత సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారి పుట్టపర్తికి విచ్చేస్తున్నారు. మంగళవారం పుట్టపర్తి వేదికగా 'రైతు భరోసా' ఐదో ఏడాది రెండో విడత నిధులు విడుదల చేయనున్నారు. అన్నదాతల కోసం ఏటా రూ.13,500 చొప్పున అందిస్తున్న వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ ఐదో ఏడాది రెండో విడత నగదు (ఒక్కొక్కరికి రూ.4 వేలు) నేడు బటన్ నొక్కి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి ఈ విడతలో 5,73,790 మంది రైతులకు రూ.234.38 కోట్ల లబ్ధి చేకూరనుంది. అందులో శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి 2,79,556 మంది రైతులకు రూ.114.21 కోట్లు అందనుంది.

ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం..

శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సమీపంలోని వై-జంక్షన్ వద్ద ఉన్న క్రికెట్ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభ నుంచే సీఎం జగన్ కంప్యూటర్ బటన్‌నొక్కి రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను జిల్లా అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ముఖ్యమంత్రి కార్యక్రమాల కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం సూచనల మేరకు స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తిలో తొలి పర్యటన కావడంతో సభను విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చే జనాలకు ఏ ఇబ్బంది రాకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. కాగా, సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్ జిల్లా స్థాయి అధికారులతో సమీక్షించారు.

పటిష్ట బందోబస్తు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తోంది. సోమవారం డీఐజీ అమ్మిరెడ్డి ఎస్పీ మాధవరెడ్డి, పోలీస్ అధికారులతో కలసి విమానాశ్రయం, సభాస్థలిని పరిశీలించారు. అనంతరం భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.



ఏర్పాట్లపై సూచనలిస్తున్న సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, చిత్రంలో ఎమ్మెల్యేలు దుద్దుకుంట, శంకరనారాయణ, సిద్దారెడ్డి, కలెక్టర్ అరుణ్‌బాబు

సీఎం పర్యటన సాగనుందిలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం 9.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి విమానంలో బయలుదేరుతారు.

- 10.15 గంటలకు సత్యసాయి విమానాశ్రయానికి వస్తారు, 10.15 నుంచి 10.25 వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు.
- 10.25 గంటలకు విమానాశ్రయం నుంచి సభా వేదికకు బయలుదేరుతారు.
- 10.40 గంటలకు సభా వేదికకు చేరుకుని, 10.45కు వేదికపై ఆశీనులు అవుతారు.
- 10.45 నుంచి 10.50 వరకు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొంటారు.
- 10.50 నుంచి 11.05 వరకు కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతారు.
- 11.05 నుంచి 11.10 వరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆడియో, వీడియోలు ప్రసారం అవుతాయి.
- 11.10 నుంచి 11.20 వరకు సీఎం జగన్ రైతులతో సంభాషిస్తారు.
- 11.20 నుంచి మధ్యాహ్నం 12.05 వరకు ముఖ్యమంత్రి ప్రసంగం ఉంటుంది.
- మధ్యాహ్నం 12.05 గంటలకు వైఎస్సార్ రైతు భరోసా చెక్కు విడుదల చేస్తారు.
- 12.20 గంటలకు సభా వేదిక నుంచి పుట్టపర్తి విమానాశ్రయానికి బయలుదేరుతారు.
- 12.25 నుంచి 12.55 గంటల వరకూ స్థానిక నాయకులతో మాట్లాడుతారు.
- మధ్యాహ్నం 1 గంటకు విమానంలో గన్నవరం బయలుదేరుతారు.



పుట్టపర్తి విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లపై సూచనలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి, చిత్రంలో శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవ్‌రెడ్డి

సర్కారు వ్యవ'సాయం'

- వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్ కింద ఏటా రూ.13,500
- నేడు ఐదో ఏడాదికి రెండో విడత రబీ సాయంగా రూ.4 వేలు

అనంతపురం అగ్రికల్చర్: రైతు వేసే ప్రతి అడుగులోనూ జగన్ సర్కారు తోడుంటోంది. అన్నదాతకు క్రమం తప్పకుండా సాయం చేస్తోంది. 'నవరత్నాలు'లో భాగంగా వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద ఏటా ఒక్కో రైతుకు రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.7,500, కేంద్రం నుంచి రూ.6 వేలు ఇస్తున్నారు. కౌలుదారులు, అటవీభూమి సాగుదారులకు కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి మొత్తం ఇస్తోంది. ఇలా మొదటి విడతగా ఖరీఫ్‌లో పంట సాగు కోసం రూ.7,500, రెండో విడతగా ఖరీఫ్ పంట కోతలు, రబీ సాగు అవసరాల కోసం రూ.4 వేలు, మూడో విడతగా ధాన్యం ఇంటికి చేరేవేళ సంక్రాంతి సమయంలో రూ.2 వేలు చొప్పున గడిచిన నాలుగేళ్లుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఐదో ఏడాది తొలివిడతకు సంబంధించి గత జూన్‌లోనే భరోసా సాయం అందించింది. రెండో విడత రబీ సాయంగా ప్రతి రైతుకూ రూ.4 వేలు చొప్పున ఇవ్వనున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం పుట్టపర్తి వేదికగా బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయాన్ని జమ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాకు రూ.234.38 కోట్లు

వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద ఈ ఏడాది రెండో విడతగా మంగళవారం ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులకు రూ.234.38 కోట్లు జమ చేయనున్నారు. ఇందులో అనంతపురం జిల్లా పరిధిలో 2,94,234 మంది రైతులకు రూ.120.17 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 2,79,556 మందికి రూ.114.21 కోట్ల మేర జమ కానుంది.

వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్ పెట్టుబడి సాయం ఇలా..

	అనంతపురం జిల్లా		శ్రీసత్యసాయి జిల్లా	
సంవత్సరం	రైతులు	భరోసా	రైతులు	భరోసా
2019-20	2,85,185	రూ.385 కోట్లు	2,56,170	రూ.348.07 కోట్లు
2020-21	2,98,545	రూ.403 కోట్లు	2,78,337	రూ.375.75 కోట్లు
2021-22	2,87,051	రూ.387 కోట్లు	2,70443	రూ.361.26 కోట్లు
2022-23	2,83,229	రూ.382 కోట్లు	2,68,904	రూ.308.18 కోట్లు
2023-24	2,89,116	రూ.216 కోట్లు	2,75,331	రూ.206.49 కోట్లు
ఇప్పటి వరకు అందినది		రూ.1,773 కోట్లు		రూ.1,599.75 కోట్లు
తాజాగా అందిస్తున్నది	2,94,234	రూ.120.17 కోట్లు	2,79,556	రూ.114.21 కోట్లు

ఇక మలివిడతగా మూడో విడత కింద వచ్చే సంక్రాంతి సమయంలో రూ.2 వేల చొప్పున ఉమ్మడి జిల్లా పరిధిలో 5,73,790 మంది రైతులకు రూ.115 కోట్ల వరకు సాయం అందనుంది. మొత్తం మీద గత నాలుగున్నరేళ్ల నుంచి వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద ఉమ్మడి అనంతపురం జిల్లాలో సరాసరి 5.70 లక్షల మంది రైతులకు ఇప్పటి వరకు రూ.3,373 కోట్ల మేర పెట్టుబడిసాయం అందించారు. ఇపుడు రబీలో రూ.4 వేలతో పాటు వచ్చే సంక్రాంతికి రూ.2 వేలు పూర్తయితే పెట్టుబడిసాయం రూ.3,722 కోట్లకు చేరుకుంటుంది. తమ వెన్నంటి ఉన్న సీఎం జగన్‌కు రైతులు కృతజ్ఞతలు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వమూ ఇలాంటి సాయం అందించిన దాఖలాలు లేవని వారు గుర్తు చేస్తున్నారు.

ఊరెళితే మాకు చెప్పండి

- దొంగలతో తస్మాత్ జాగ్రత్త
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ విజ్ఞప్తి

అనంతపురం క్రైం: దొంగతనాలు జరగకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం సేవలు వినియోగించుకోవాలని సూచించారు. దొంగతనాల నియంత్రణలో భాగంగా సాంకేతికతను ఉపయోగించి లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం యాప్‌ను రూపొందించామన్నారు.

యాప్ నమోదు : ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్‌కు వెళ్లి 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం' అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ అయ్యాక అందులో మీ పేరు, వివరాలు పొందుపరిచి లాగిన్ కావాలి. అప్పుడు వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ నంబర్) వస్తుంది. ఆ నంబర్‌ను ఎంటర్ చేస్తే యూనిక్ ఐడీ వస్తుంది. అప్పుడు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంలో నమోదయినట్టు.

పోలీసు సేవలు

ఊళ్లకు వెళ్లే సమయంలో ఇంట్లోని విలువైన వస్తువులు దొంగతనం కాకుండా చూసుకునేందుకు ఈ యాప్ సేవలు ఉపయోగించుకోవచ్చు. ఇందుకోసం లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంలోకి వెళ్లి 'రిక్వెస్ట్ పోలీసు వాచ్' ఎంపిక చేసుకోవాలి. ఏ రోజు, ఏ సమయంలో ఆ ఇంటి నుంచి ఊరికి వెళ్తున్నారు.. ఏ సమయంలో తిరిగి వస్తున్నారు.. అనే వివరాలను అందులో పూరించాలి. ఆ మెసేజ్ జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలోని కమాండ్ కంట్రోల్‌కు వెళ్తుంది. అక్కడి నుంచి సంబంధిత పోలీసులకూ సమాచారం చేరుతుంది. పోలీసులు వచ్చి ఇంటర్నెట్ ప్రొటోకాల్ టెస్ట్ (ఐపీ) వైఫై కెమెరాను ఇంట్లో ఉచితంగా అమర్చుతారు. రిక్వెస్ట్ పోలీసు వాచ్‌లో పేర్కొన్న నిర్దేశిత సమయంలో ఆ ఇంట్లో ఎలాంటి కదలికలు ఉన్నా వెంటనే వైఫై కెమెరా ద్వారా కమాండ్ కంట్రోల్లో సైరన్ మోగుతుంది. తద్వారా పోలీసులు ఆ ఇంటికి చేరుకుని దొంగలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునే వీలుంది. జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా, దొంగలు చొరబడే వీలున్నా వెంటనే తన మొబైల్ నంబర్ 9440796800కు తెలియజేయాలని ఎస్పీ అన్బురాజన్ విజ్ఞప్తి చేశారు.

పాదయాత్ర.. ఓ చరిత్ర



వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం తదితరులు

- ప్రజాసంకల్ప యాత్రకు ఆరేళ్లు పూర్తి
- అనంతపురంలో ఘనంగా సంబరాలు

అనంతపురం సిటీ: ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ప్రజా సంకల్ప యాత్ర' పేరిట చేపట్టిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ప్రజా సంకల్ప యాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా అనంతపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం సంబరాలు చేసుకున్నాయి. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బీసీ రమేష్ గౌడ్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ పాదయాత్ర చేపట్టి 341 రోజుల పాటు 3,648 కిలోమీటర్ల మేర అన్ని ప్రాంతాలూ తిరిగి ప్రజల కష్టాలు తెలుసుకున్నారన్నారు. 'నేను విన్నాను-నేను ఉన్నాను' అంటూ అభయమిస్తూ.. ప్రజల సంక్షేమానికి ఆనాడే మంచి ఆలోచన చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రతిష్టాత్మకంగా నవరత్నాలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ నెల 9 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' పేరుతో ప్రజల్లోకి వెళ్తామన్నారు. ఇప్పటికే 98 శాతం హామీలు అమలు చేసి మరో చరిత్ర సృష్టించిన జగన్.. మరో 30 ఏళ్లు ఆయనే సీఎంగా ఉండాలని జనం కోరుకుంటున్నారని అనంత అన్నారు. అనంతపురం నియోజకవర్గంలో రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రూ.300 కోట్లతో సర్వజనాస్పత్రి విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, ఇదంతా సీఎం జగన్ వల్లే సాధ్యమైందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మహిళల పక్షపాతిగా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అభివర్ణించారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొందకనే ఏపీలో మహిళలకు 50 శాతం రాజకీయ ప్రాధాన్యం ఇచ్చి, వారికి సముచిత స్థానం కల్పించిన గొప్ప మానవతావాది వైఎస్ జగన్ అని కొనియాడారు. ముస్లిం మైనార్టీలకు గుర్తింపునిచ్చి, ప్రోత్సహిస్తున్న సీఎం జగన్‌కు తాము జీవితాంతం రుణపడి ఉంటామని మేయర్ వసీం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, నాయకులు పామిడి వీరా, కృష్ణమూర్తి, మహిళా విభాగం ప్రతినిధులు కృష్ణవేణి, శ్రీదేవి, కొండమ్మ, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ, అనుబంధ విభాగాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిపత్రిలో కంపు రాజకీయం

- అండర్ డ్రైయినేజీ పనుల వద్ద జేసీ ప్రభాకర్ హంగామా
- పనులు అడ్డుకునేందుకు మున్సిపల్ చైర్మన్ యత్నం
- పోలీసుల రంగప్రవేశంతో జారుకున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు



రెండో వార్డులో పనులను అడ్డుకుంటున్న చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, అనుచరులు

తాడిపత్రి అర్బన్: మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి టీడీపీ ఉనికి కోసం 'కంపు రాజకీయం' చేయడం ప్రజల్లో జుగుప్సను కలిగించింది. తాడిపత్రి పట్టణంలోని కెనరా బ్యాంక్ ముందున్న సీబీ రోడ్డులో అండర్ డ్రైయినేజీ వ్యవస్థ దెబ్బతిని మ్యాన్‌హోల్ నుంచి లీకైన మురుగు బయటకు వచ్చి నిలిచిపోయింది. ఇంకా పలు చోట్ల ఇదే పరిస్థితి తలెత్తింది. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు తమకేమీ పట్టనట్టుగా ఉండిపోయారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి డ్రైయినేజీ నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని ఇటీవల మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పారిశుధ్య కార్మికులు సీబీ రోడ్డులోని మ్యాన్‌హోల్ వద్ద మరమ్మతు పనులు చేస్తున్నారు. అయితే ఈ క్రెడిట్ అధికార పార్టీకి వెళ్తుందని భావించిన జేసీ ప్రభాకర్‌రెడ్డి టీడీపీ ఉనికి కాపాడుకునేందుకు సోమవారం కౌన్సిలర్లతో కలిసి ఆందోళనకు దిగారు. కెనరా బ్యాంక్ ఎదురుగా రోడ్డుపై నిలిచిన మురుగునీటిలో కుర్చీ వేసుకుని కూర్చున్నాడు. సహచర కౌన్సిలర్ మల్లికార్జునను మురుగులో పొర్లించాడు. తాను చేసిన ఆందోళన వల్లే అధికారులు స్పందించి పనులు చేస్తున్నారన్న సంకేతాలను ప్రజల్లోకి పంపే యత్నం చేశారు. 'కంపు' రాజకీయం గురించి తెలుసుకున్న చింతల వెంకటరమణస్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేలూరి మురళీప్రసాద్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు అక్కడకు చేరుకుని జేసీ ప్రభాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ చైర్మన్ అయ్యుండి పనులు జరగకుండా అడ్డు తగలడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జేసీ డౌన్ డౌన్... జేసీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో డీఎస్పీ గంగయ్య, సీఐలు హమీద్‌ఖాన్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐలు రామకృష్ణ, ధరణీబాబు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పట్టణ అభివృద్ధికి అడ్డు తగిలితే ఉపేక్షించేది లేదని డీఎస్పీ తనదైన శైలిలో హెచ్చరించి పంపించేశారు. అక్కడి నుంచి బయటకు వచ్చిన ప్రభాకర్‌రెడ్డి అనుచరగణం.. రెండో వార్డులో జామియా మసీదు వద్ద వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా చేయిస్తున్న అండర్ డ్రైయినేజీ పనుల వద్దకు చేరుకుంది. పనులు అలా కాదు ఇలా చేయాలంటూ ఏక వచన సంబోధనతో పాటు దురుసుగా మాట్లాడిన జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ఫయాజ్‌బాషా ఆగ్రహించారు. కౌన్సిల్ ప్రతిపక్ష పార్టీ నేతలకు మర్యాద ఇవ్వడం కూడా తెలీదా అని తిరగబడటంతో .. జేసీ ప్రభాకర్‌రెడ్డి అందరి సమక్షంలో 'క్షమాపణ' చెప్పాడు. సమాచారం అందుకున్న సీఐలు హమీద్‌ఖాన్, లక్ష్మీకాంత్‌రెడ్డి అక్కడకు చేరుకోగానే జేసీ అనుచరగణం చిన్నగా జారుకుంది.

ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు

ప్రజా జీవనానికి, రవాణాకు ఆటంకం కల్గించి 30 పోలీస్ యాక్టు ఉల్లంఘించడంతో పాటు అధికారుల విధులకు అడ్డు తగిలినందుకు టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిపై అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. చైర్మన్‌తో పాటు 30 మంది టీడీపీ కౌన్సిలర్లపై 341, 188 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలను చూపుతున్న సీఎస్‌డీటీ సూర్యనారాయణ

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో రేకుల షెడ్డులో అక్రమంగా డంప్ చేసిన 60 బస్తాల రేషన్ బియ్యాన్ని సీఎస్‌డీటీ సూర్యనారాయణ, రెవెన్యూ టాస్క్ ఫోర్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ట్రాక్టర్ ద్వారా గుత్తి ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌కు తరలించారు. బియ్యం అక్రమంగా డంప్ చేసిన వారిపై రెవెన్యూ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

రైలు ఢీకొని దివ్యాంగుడి మృతి



గోపాల్ (ఫైల్)

గుంతకల్లు: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ దివ్యాంగుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని మిల్లు ప్రాంతానికి చెందిన గోపాల్ (38) పోలియో కారణంగా చిన్నప్పుడే దివ్యాంగుడిగా మారాడు. 10 ఏళ్ల కిత్రం అనిత అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. చేనేత కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం ఇంటి సమీపంలోని పొలాల్లో బహిర్భూమికి వెళ్లిన ఆయన... తిరిగి వస్తూ తిమ్మనచెర్ల రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా గుంతకల్లు జంక్షన్ నుంచి వేగంగా వస్తున్న రైలు ఢీకొంది. ఘటనలో గోపాల్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఘటనపై భార్య అనిత ఫిర్యాదు మేరకు జీఆర్‌పీ ఎస్‌ఐ మహేంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డిటోనేటర్ పేలి యువకుడికి గాయాలు

డి హీరేహాళ్(రాయదుర్గం): డిటోనేటర్ పేలి ఓ యువకుడు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... డి హీరేహాళ్ మండలం పూలకుర్తికి చెందిన గొర్రెల కాపారి శివాజీ.. సోమవారం ఉదయం జీవాలను మేపునకు సమీపంలోని క్వారీ ప్రాంతానికి తోలుకెళ్లాడు. అక్కడ పడి ఉన్న డిటోనేటర్‌ను సిల్వర్ సామగ్రిగా భావించి తీసుకున్నాడు. దానికి అంటుకున్న మట్టిని తొలగించే క్రమంలో రాయితో పగులగొట్టేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో డిటోనేటర్ పేలి చేతి వేళ్లకు గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు డి.హీరేహాళ్ ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్

- రూ.13.70 లక్షలు విలువ చేసే 14 బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: జల్సాల కోసం చోరీలను మార్గంగా ఎంచుకున్న ద్విచక్ర వాహనాల దొంగలను అనంతపురం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు. అన్నమయ్య జిల్లా ఇందిరానగర్‌కు చెందిన కుందాని దిన ప్రకాష్, నార్పలలోని కొత్తబస్టాండ్ ప్రాంతానికి చెందిన ఆవుల సిద్దార్థ స్నేహితులు. వీరిలో ప్రకాష్ కీలక నిందితుడు. గతంలో తిరుపతిలో ద్విచక్ర వాహనాలు అపహరించిన కేసులో జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చాడు. కూలి పనులతో వచ్చే ఆదాయం జల్సాలకు చాలక వాహనాలను అపహరించుకెళ్లడం అలవాటుగా మార్చుకున్నాడు. జేసీబీ వాహనానికి సహాయకుడిగా వెళ్లే సిద్దార్థను కలుపుకుని నకిలీ తాళాలతో అనంతపురం, నార్పల, పుట్లూరు, బుక్కరాయసముద్రంలో దుకాణాల ఎదుట నిలిపిన ద్విచక్రవాహనాలను అపహరించి, ఓ చోట డంప్ చేసేవారు. వీటిని అనంతపురంలోని భైరవనగర్‌కు చెందిన కారు డ్రైవర్ సంపతి విజయ్ సాయంతో విక్రయించి, వచ్చిన సొమ్ముతో ముగ్గురూ జల్సాలు చేసేవారు. ఇటీవల జిల్లాలో జరిగిన ద్విచక్ర వాహనాల దొంగతనాలపై ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో సోమవారం ఉదయం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న గోశాల వద్ద ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.13.70 లక్షలు విలువ చేసే 14 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన డీఎస్పీ ప్రసాదరెడ్డి, అనంతపురం వన్‌టౌన్ సిఐ.రెడ్డెప్ప, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని ఎస్పీ అభినందిస్తూ రివార్డులు ప్రకటించారు.

అపరిచితులు అమ్మే ఫోన్లు కొనొద్దు

అపరిచితులు విక్రయించే ఫోన్లను కొనకూడదని జిల్లా వాసులకు ఎస్పీ అన్బురాజన్ సూచించారు. ఇటీవల పోలీసులు రికవరీ చేసిన రూ. 40.35 లక్షల విలువ చేసే 208 సెల్‌ఫోన్లను సంబంధీకులకు సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకూ చాట్ బాట్ సేవల ద్వారా రూ. 12.43 కోట్లు విలువ చేసే 7,625 మొబైల్ ఫోన్లను బాధితుల దరి చేర్చినట్లు గుర్తు చేశారు. ఫోన్లను తస్కరించే వారిపై ప్రత్యేక నిఘా వేశామన్నారు. బిల్లులేకుండా సెల్‌ఫోన్ అమ్మేవారు తారసపడితే వెంటనే 94407 96800కు సమాచారం అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

'పోలీసు స్పందన'కు 144 వినతులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 144 వినతులు అందాయి. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు.

అంతర వర్సిటీ టెన్నిస్ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో జేఎన్‌టీయూ వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన, తదితరులు

అనంతపురం: ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ బెంగళూరులోని జైన్ యూనివర్సిటీ వేదికగా జరిగే అంతర వర్సిటీ మహిళా టెన్నిస్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జేఎన్‌టీయూ అనంతపురం క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ సోమవారం ముగిసింది. ఈ మేరకు వర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ బి.జోజిరెడ్డి తెలిపారు. ఎంపికైన వారిలో బి.మానస (బాలాజీ పీజీ కళాశాల, అనంతపురం), ఎస్.హరిణి (ఎస్వీసీఈ, తిరుపతి), పి.ధన్యసాయి (జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ కళాశాల, అనంతపురం), పి.శ్వేత (ఆర్‌జీఎం, నంద్యాల) ఎ.ప్రవళిక (శాంతిరామ్ ఫార్మసీ కళాశాల, నంద్యాల) ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులను జేఎన్‌టీయూ వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ , వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి అభినందించారు.

సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

అనంతపురం అర్బన్: కంబదూరు తహసీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పెద్దన్నపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ ఎం.గౌతమి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన బుక్కరాయసముద్రం వీఆర్‌ఓగా పనిచేస్తున్న సమయంలో అతని విధులతో సంబంధం లేని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి వంశవృక్షం మంజూరు చేశారు. ఆ సర్టిఫికెట్ మీద సంతకం చేస్తూ తేదీని పొందుపర్చలేదు. ఇది కాస్త వివాదాస్పదమై ఫిర్యాదు అందడంతో విచారణకు కలెక్టర్ ఆదేశించారు. విచారణ అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆయనను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు.

ఓపీ 1,025

అనంతపురం మెడికల్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 1,025 మంది ఓపీ సేవలు పొందారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి వెల్లడించారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద 169 మంది చికిత్స పొందారన్నారు. కాగా, మంగళవారం ఉదయం అనంతపురంలోని 6వ రోడ్డు, పాతూరు, రూరల్ పరిధిలోని మన్నీలలో వైద్య శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి జర్నలిస్టుల క్షీరాభి షేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

అనంతపురం టవర్‌క్లాక్: సుదీర్ఘకాలంగా జర్నలిస్టులు ఎదురు చూస్తున్న ఇంటి స్థలాల కల నెరవేరబోతోందని అనంతపురం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ ఆజాద్ అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ సోమవారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి జర్నలిస్టులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆజాద్‌తో పాటు సాక్షి బ్యూరో ఇన్‌చార్జి రామచంద్రారెడ్డి, వార్త బ్యూరో ఇన్‌చార్జ్ భోగేశ్వరరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ఇప్పటి వరకూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించలేదన్నారు. దాదాపు 40 ఏళ్ల కలను సాకారం చేస్తూ ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఆయనకు జర్నలిస్టుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సాక్షి బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, సీనియర్ జర్నలిస్టులు శివారెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి, కేపీ కుమార్, ప్రసాద్, రసూల్, శ్రీనివాసులు, నరేష్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు అన్యాయం



ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు రమేష్‌గౌడ్ తదితరులు

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు రమేష్‌గౌడ్ అన్నారు. మహిళా రిజర్వేషన్‌లో ఓబీసీ మహిళలకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలో 50 శాతానికి పైగా ఓబీసీ మహిళలు ఉన్నారన్నారు. 15 శాతంగా ముస్లిం మైనార్టీ మహిళలు ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకున్న మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ, ముస్లిం మైనార్టీ మహిళలకు అన్యాయం జరిగిందన్నారు. మొత్తం మహిళల్లో 60 శాతం మహిళలను శాసనాలు రూపొందించే వ్యవస్థల నుంచి దూరం చేయడమే అన్నారు. ఇది సామాజిక న్యాయ సూత్రానికి విరుద్ధమన్నారు. చట్టసభల్లో ఓబీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ బిల్లులను పార్లమెంట్‌లో తక్షణం ప్రవేశపెట్టి ఆమోదింపజేసి.. 2024 సాధారణ ఎన్నికల్లో అమలు చేయాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు.

నిజంగా 'ఆపద్బాంధవు'లే..



వృద్ధురాలిని ఆస్పత్రిలో చేరుస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఉవవకొండ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మతి స్థిమితం లేని వృద్ధురాలిని ఆపద్బాంధవ ట్రస్ట్ సభ్యులు సకాలంలో ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడారు. వివరాలు.. ఉరవకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు గోపాల్, నాగరాజు సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వస్తుండగా మండల కేంద్రం సమీపంలోకి చేరుకోగానే మతిస్థిమితం లేని వృద్ధురాలు అడ్డుగా రావడంతో ఢీకొన్నారు. ఘటనలో తండ్రీకొడుకులతో పాటు వృద్ధురాలూ తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు తండ్రీకొడుకులను వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే వృద్ధురాలి గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయం తెలుసుకున్న ఆపద్బాంధవ ట్రస్ట్ సభ్యులు అక్కడకు చేరుకుని ఆమెను ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. సకాలంలో వృద్ధురాలిని ఆస్పత్రికి చేర్చి, ఆమె ప్రాణాలు కాపాడిన ట్రస్ట్ ప్రతినిధి మురళి, సభ్యులను ఈ సందర్భంగా వైద్యులు అభినందించారు.

హౌసింగ్‌లో ఇద్దరికి పదోన్నతి

అనంతపురం టౌన్: గృహ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న ఇద్దరు డీఈలకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అజయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం డీఈగా పనిచేస్తున్న శైలజకు ఈఈగా పదోన్నతి కల్పిస్తూ అనంతపురం డివిజన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో డీఈగా పనిచేస్తున్న ఎంజీకే నాగరాజుకు ఈఈగా పదోన్నతి ఇస్తూ ధర్మవరం డివిజన్ కేటాయించారు.

పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని ముకుందాపురానికి చెందిన నారాయణపై పోక్సో నమోదైంది. ఈ మేరకు గార్లదిన్నె స్టేషన్ హౌస్ ఆఫీసర్ సూర్యనారాయణ సోమవారం వెల్లడించారు. 14 ఏళ్ల బాలికను చేయి పట్టుకొని లాగి, అసభ్యంగా ప్రవర్తించాడంటూ బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నారాయణపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.

వర్సిటీకి ఉచితంగా రెండు ఎలక్ట్రికల్ కార్లు



ఎలక్ట్రికల్ కార్లను ప్రారంభిస్తున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి ఉచితంగా రెండు ఎలక్ట్రికల్ కార్లను యూనియన్ బ్యాంక్ అందజేసింది. వర్సిటీ ప్రధాన ద్వారం నుంచి సుదూరంగా ఉన్న వైఎస్సార్ పరీక్షల భవనానికి విద్యార్థులు ఈ కార్లను వినియోగించుకునే వెసులుబాటును అధికారులు కల్పించారు. ఎలక్ట్రికల్ కార్లు కేవలం సర్టిఫికెట్లకు వచ్చే విద్యార్థులు మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది. వీటిని వర్సిటీ వీసీ డాక్టర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ఎ.కృష్ణకుమారి, ప్రొఫెసర్లు పి.మురళీకృష్ణ, వి.రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ఎస్కేయూకు చేరిన కియా కార్లు

కియా కంపెనీ ఉచితంగా అందించిన రెండు కార్లు సోమవారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలకు చేరాయి. వీటిని వర్సిటీ వీసీ డాక్టర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించేందుకు వీలుగా కియా యాజమాన్యం రెండు కార్లను ఉచితంగా అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ఎ.కృష్ణకుమారి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్ర పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కళ్యాణదుర్గం: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లుకు చెందిన బోయ బొమ్మన్న (45)కు భార్య ఉమక్క, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో ఇద్దరికి పెళ్లి చేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బొమ్మన్నకు పలు ఆస్పత్రుల్లో కుటుంబసభ్యులు చికిత్స చేయించారు. అయినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన ఆదివారం రాత్రి కుటుంబసభ్యులు నిద్రపోయాక ఇంట్లోనే లుంగీతో ఉరి వేసుకున్నాడు. ఆ సమయంలో పెద్దగా శబ్దం రావడంతో మేల్కొన్న కుటుంబసభ్యులు.. ఉరికి వేలాడుతూ గింజుకుంటున్న బొమ్మన్నను గమనించి కిందకు దించేలోపు ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై ఉమక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆంధ్ర క్రికెట్ జట్టులో ముగ్గురికి చోటు



హనీష్ వీరారెడ్డి



టి.ప్రదీప్‌రెడ్డి



అర్జున్ టెండూల్కర్

అనంతపురం: బీసీసీఐ ఆధ్వర్యంలో త్వరలో జరిగే కుచ్ బెహార్ క్రికెట్ ట్రోఫీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే అండర్-19 ఆంధ్రా క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. ఎంపికైన వారిలో కోగటం హనీష్ వీరారెడ్డి, టి. ప్రదీప్‌రెడ్డి ఉన్నారు. ఈ నెల 17 నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకూ దేశంలోని పలు ప్రాంతాల్లో క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు.అలాగే ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకూ ఛత్తీస్‌ఘడ్ వేదికగా బీసీసీఐ ఆధ్వర్యంలో జరిగే అండర్-23 వన్డే అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో జిల్లాకు చెందిన పి.అర్జున్ టెండూల్కర్‌కు చోటు దక్కింది. గొట్లూరు గ్రామానికి చెందిన అర్జున్ టెండూల్కర్ ఇటీవల కడపలో జరిగిన అంతర జోన్ టోర్నీ 5 ఇన్నింగ్స్‌ల్లో 206 పరుగులు చేశారు. ఇందులో ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీ ఉండడం గమనార్హం.

క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ ఒత్తిడిని తగ్గించుకోవాలి



మాట్లాడుతున్న మానసిక వైద్య నిపుణుడు విశ్వనాథ్

రాప్తాడు: నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడిని తగ్గించుకోవాలని మానసిక వైద్య నిపుణుడు విశ్వనాథ్ తెలిపారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో 'మానసిక ఒత్తిడిని ఎలా జయించాలి' అనే అంశంపై అవగాహన కల్పించారు. వైద్యనిపుణుడు మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా ఒత్తిడిని జయించేందుకు అనేక మార్గాలున్నాయన్నారు. మనసు ప్రశాతంతంగా ఉంచుకోవడం, ధ్యానం , యోగా క్రమం తప్పకుండా చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. ఆధ్యాత్మిక విషయాలను చదువుతుండడం, చక్కని సంగీతం వినడం తదితర వాటి ద్వారా ఒత్తిడిని సులువుగా తగ్గించుకోవచ్చన్నారు. ప్రతి నెలా మొదటి సోమవారం పీహెచ్‌సీలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివకృష్ణ, సీహెచ్‌ఓ శివప్రసాద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో మెరిసిన ఈషా సంజన



ఈషా సంజనను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: టేబుల్ టెన్నిస్ అండర్–14 విభాగం రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈషా సంజన ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 4,5 తేదీల్లో గుంటూరులో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొని, ప్రతిభ కనబరిచింది. ఈ విద్యార్థినిని సోమవారం నగర శివారులోని ఏజీఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

తహసీల్దార్‌ను కలిసిన డీలర్ల సంఘం నాయకులు

అనంతపురం రూరల్: అనంతపురం అర్బన్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన బాలకిషన్‌ను డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలనాగిరెడ్డి, కోశాధికారి రాధాకృష్ణ, ఈసీ మెంబర్లు రాజమ్మ, ఎర్రిస్వామి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సమన్వయంతో పనిచేసి నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు సత్య రంగయ్య, ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ సంఘం నాయకులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

8న విద్యా సంస్థల బంద్



ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌కు బంద్ కరపత్రం అందిస్తున్న విద్యార్థి నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కడప ఉక్కు పరిశ్రమ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం వివిధ కళాశాలల యాజమాన్యాలను కలిసి విజ్ఞప్తి చేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్, ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి అబ్దుల్ అలాం, బీసీ,ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ యాదవ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఎదురుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఈనెల 8 నాటికి 1000 రోజులు కావస్తున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, ఏఐవైఎఫ్ ధనుంజయ, ఏఐఎస్‌ఏ నాయకులు నరసింహ, పవన్, పీడీఎస్‌యూ నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల ప్రాముఖ్యత తెలియజేయండి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల ప్రాముఖ్యతను తెలియజేయాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. సోమవారం నగరంలోని నీరుగంటి వీధి, రెండో రోడ్డు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. నగరంలో జరిగిన అభివృద్ధిపై రెండో రోడ్డులో విశ్రాంత ఉపాధ్యాయురాలు లక్ష్మి ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. బ్రిడ్జి పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు ప్రతి వీధిలో పెద్ద ఎత్తున రోడ్లు, కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో తాగునీరు సరిగా వచ్చేది కాదని, ఇప్పుడు రోజూ నీరు సమృద్ధిగా వస్తోందని ఎమ్మెల్యేతో లక్ష్మి ఆనందాన్ని వ్యక్తం చేశారు. పేదలకు ఇంటి వద్దకే వేకువజామున పింఛన్ అందించడం, సచివాలయ, వలంటీర్ వ్యవస్థ చాలా బాగుందున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో వైద్యులు, సిబ్బంది ఓపిగ్గా అందరినీ కూర్చోబెట్టి సమస్య తెలుసుకొని మందులు పంపిణీ చేస్తున్నారన్నారు. ఇన్నేళ్లలో ఎన్నడూ లేనివిధంగా జగనన్న ప్రభుత్వం చేస్తున్న మంచి పనికి గర్విస్తున్నామన్నారు.



నగరంలో అభివృద్ధి, సచివాలయ, వలంటీర్ వ్యవస్థపై ఎమ్మెల్యే అనంతకు తెలియజేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయిని లక్ష్మి

ఆరోగ్య సేవలు తెలియజేయాలి..

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను మరింత బలోపేతం చేశారని, ఇక్కడ అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వారిలో చైతన్యం తీసుకురావాలని మెడికల్ ఆఫీసర్ కావ్య, తదితర సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. నగరంలో పది పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని, అందులో 64 రకాల పరీక్షలు, 172 రకాల మందులు ఇస్తారని, గర్భిణులకు సేవలందించేందుకు పడకలను అందుబాటులో ఉంచారన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయం అందుతున్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, శ్రీదేవి, కార్పొరేటర్లు శాంతి సుధ, నాయకులు మధు, ఆజిలే జనార్దన్‌రెడ్డి, శోభా బాయి, భారతి, దాదు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష శిబిరాలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు జరగనున్నాయి. ఆరో రోడ్డు ఆదర్శ స్కూల్, పాతూరులోని కస్తూరిబా స్కూల్‌లో వైద్య శిబిరాలు జరగనున్నాయి.

మహానంది వసతి గృహాన్ని కేటాయించాలి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలల్లో పీజీ చదువుతున్న విద్యార్థులకు మహానంది వసతి గృహాన్ని యథాతథంగా కేటాయించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు జార్జ్ రెడ్డి, మహేష్, కార్తీక్, రాజేశ్, హరీష్ , శంకర్, పవన్, మధుసూదన్ ఓ ప్రకటనలో కోరారు. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందించారు. మహానందిలో ఉన్న విద్యార్థులను గంగ వసతి గృహానికి కేటాయించాలని అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. భవనం శిథిలావస్థ దశలో ఉన్న నేపథ్యంలో మహానంది వసతి గృహంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు సోమవారం కలిశారు. ఇటీవల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ జిల్లా పర్యటనలో ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయడంలో ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యేకు ఏపీటీఎఫ్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల ఉన్నతికి కృషి చేసిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్. సిరాజుద్దీన్, మండల విద్యాశాఖ అధికారుల సంఘ నాయకులు వెంకటస్వామి, నరసింహారెడ్డి, బాధితురాలు జయమణి, జిల్లా, మండల నాయకులు సతీష్ కుమార్, చెన్నకేశవ, గంగాధర్, ఓబులేష్, వన్నప్ప, హనుమంతు, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అనంతకు బొకే అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

సామాజిక ఇంజినీర్లుగా ఖ్యాతి గడించాలి

- జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగ జనార్ధన

అనంతపురం: విద్యార్థులు సామాజిక ఇంజినీర్లుగా ఖ్యాతి గడించాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్ధన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు స్వాగత కార్యక్రమం (ఫ్రెషర్స్ డే) నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జూనియర్లు, సీనియర్లు అనే తారతమ్యం లేకుండా అందరూ కలిసికట్టుగా చదువుతూ ఉండడం గర్వకారణమన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం మీద అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. విశిష్ట అతిథిగా హాజరైన పి. శంకర నారాయణ (1970 బ్యాచ్ పూర్వ విద్యార్థి) మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులు ఉద్యోగాలను కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ విద్యార్థులు సివిల్ సర్వీసెస్‌పై దృష్టి సారించాలన్నారు. రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ నాలుగేళ్లు కష్టపడి చదివితే, పదికాలాల పాటు ఉన్నత స్థానంలో ఉంటారని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, స్పోర్ట్స్ సెక్రటరీ బి. జోజిరెడ్డి , డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణ కాంతి, ప్రొఫెసర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక విద్యాపద్ధతుల్లో జ్ఞానం మిళితం చేయాలి

అనంతపురం: జాతీయ వృద్ధిని పెంపొందించడానికి ఆధునిక విద్యాపద్ధతుల్లో జ్ఞానాన్ని మిళితం చేయాలని జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగ జనార్ధన పేర్కొన్నారు. ప్రాచీన విజ్ఞానాన్ని కాపాడుతూనే.. అధునాత సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించాలన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏబీఆర్‌ఎస్‌ఎం ఆధ్వర్యంలో భారత్, సంప్రదాయాలు, విధానాలు – పురోగతి' అనే అంశంపై గత రెండు రోజులుగా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. జాతీయ సంయుక్త ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంత లక్ష్మణ్ హాజరయ్యారు. ప్రొఫెసర్ వైపీ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ సాంప్రదాయ విద్యా విలువలు, సాంస్కృతిక మూలాలతో సమకాలీన విద్యా విధానాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం విద్యా రంగంలో సరికొత్త పురోగతి తెస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ జింకా రంగజనార్ధన

ఆర్టీసీ బస్సు ఢీకొని స్కూటరిస్టు మృతి



మృతి చెందిన మహబూబ్ బాషా

అనంతపురం క్రైం: స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతిచెందాడు. ట్రాఫిక్ సీఐ వెంకటేశ్ నాయక్ తెలిపిన మేరకు.. కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై హిందూపురం ఆర్టీసీ డిపో బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని, సుమారు వంద మీటర్ల దూరం ఈడ్చుకెళ్లింది. ద్విచక్ర వాహనం బస్సు చక్రాలకింద ఇరుక్కుపోయింది. ఈ ప్రమాదంలో వినాయక్ నగర్‌కు చెందిన మహబూబ్ బాషా (24), సయ్యద్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి వీరిని 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స ప్రారంభిస్తుండగానే మహబూబ్ బాషా మృతి చెందాడు. సయ్యద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై ట్రాఫిక్ పోలీసులు విచారిస్తున్నారు. కలెక్టర్ కార్యాలయం ముందు మూడు చోట్ల మలుపులు ఉండడంతో ప్రమాదాలు కూడా అదే స్థాయిలో జరుగుతున్నాయని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామని ట్రాఫిక్ సీఐ వెంకటేష్‌నాయక్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు నలుగురు ఎంపిక



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల హెచ్ఎం, పీడీ

కనగానపల్లి: కనగానపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నలుగురు ఏపీ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీడీ రమేష్ తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో జరిగిన స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయిలో జరిగిన ఖోఖో పోటీల్లో కనగానపల్లి విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో వైష్ణవి, అర్చన, ఎర్రిస్వామి, నాగచైతన్య అత్యంత ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు నవంబర్ 9 నుంచి 12 వరకు చిత్తూరులో నిర్వహించనున్నట్లు తెలిపారు.విద్యార్థులు, పీడీని హెచ్ఎం లక్ష్మీదేవి, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

సామాజిక విప్లవానికి నాంది

అనంతపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బడుగు, బలహీన వర్గాల వారికి దన్నుగా నిలిచి, సామాజిక విప్లవానికి నాందీ పలికారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ఆరేళ్లయ్యిందని, ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత పారదర్శక పాలన అందించారన్నారు. ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందించి, అందరి మన్ననలను అందుకుంటున్నారన్నారు.

ఆత్మకూరు: జనం కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు ఆరేళ్లయిన సందర్భంగా మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేసి, వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా స్థానికంగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బాలపోతన్న, జిల్లా కార్యదర్శులు వెంకట్రాముడు, మల్లన్న, వైస్ ఎంపీపీ విజయ్, మదిగుబ్బ సర్పంచ్ నరసింహులు, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, మండల కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫణిరెడ్డి, నాగరాజు, లక్ష్మీనారాయణరెడ్డి, అంజినప్ప, అతికిరెడ్డి, గోపాల్, రామాంజి, విశ్వనాథ్‌రెడ్డి, చెన్నారెడ్డి, బాబయ్య, సచివాలయ కన్వీనర్లు మరళి, శ్రీరామ్, వెంకటేష్, నరేంద్ర, బాలు, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



ఆత్మకూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు



వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎల్ఎం ఉమ, ఎల్ఎం మోహన్‌రెడ్డి

వైఎస్సార్ సీపీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్‌గా చిట్రెడ్డి

రాప్తాడు: నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడు మండల ఎన్నికల ఇన్‌చార్జ్‌గా చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డిని ఎంపిక చేశారు. చిట్రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమపాలన అందిస్తూ, 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కులమతాలు, పార్టీలు, రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్నట్లు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని మరోసారి ఆదరించాలని కోరారు. ఇప్పటి నుంచి నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ పార్టీ బోపేతానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఆయన సోదరులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి (చందు)కి కృతజ్ఞతలు తెలిపారు.

మోదీది నియంతృత్వ పాలన

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్ర



ఎఫ్ఐఆర్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నియంతృత్వ పాలన సాగిస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ అన్నారు. ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తున్న జర్నలిస్టులను జైలుకు పంపడం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. జర్నలిస్టులపై కేసులను ఎత్తివేసి, వారిని బేషరుతుగా విడుదల చేయాలని ఆలిండియా కిసాన్ సమన్వయ కమిటీ, కార్మిక సంఘాల జేఏసీ పిలుపుమేరకు నాయకులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఎఫ్ఐఆర్ ప్రతులను దహనం చేసి, నిరసన తెలిపారు. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా నడిపిన రైతు ఐక్య ఉద్యమానికి మద్దతుగా నిలిచిన వార్తా చానల్‌పై మోదీ ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. జర్నలిస్టులు ప్రబీర్ పురకాయస్త, అమిత్ చక్రవర్తిపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపిందన్నారు. ఇలా దుర్మార్గ పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, రైతు సంఘం నాయకులు నాగరాజు, రాయుడు, నల్లప్ప, రాముడు, నరసింహారెడ్డి, నాగార్జున, ఓబులేసు, శంకర్, ఆదినారాయణ, నాగమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మూడు రాజధానుల ఏర్పాటుకు చట్టం చేయాలి

అనంతపురం అర్బన్: అభివృద్ధి వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఈ విషయంగా మూడు రాజధానుల ఏర్పాటుకు ప్రత్యేక చట్టం అమలులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వానికి అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి విన్నవించింది. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్‌కు సమితి నాయకులు వినతి పత్రం అందజేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. మూడు ప్రాంతాల్లో మూడు రాజధానుల ఏర్పాటుకు శాసనసభలో చట్టం చేసి అమలు చేయాలని, రాయలసీమలో హైకోర్టుతో పాటు మినీ సెక్రటరీయేట్ ఏర్పాటు, ఒక సెషన్ అసెంబ్లీ సమావేశాలు జరపాలని, కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని, కృష్ణా జలాల పునః పంపిణీ జీఓను కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని తదితర 12 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కేవీ రమణ, ప్రధాన కార్యదర్శి రాజా హొన్నూరు, కోశాధికారి కె.పి.కుమార్, ఉపాధ్యక్షుడు జి.వెంకటసుబ్బయ్య, సభ్యురాలు కృష్ణవేణి పాల్గొన్నారు.



జేసీ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి నాయకులు

సీఎం సభను జయప్రదం చేయండి

కనగానపల్లి: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో మంగళవారం జరిగే వైఎస్సార్ రైతు భరోసా పంపిణీ సభను జయప్రదం చేయాలని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ కోరారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు తరలివెళ్తున్నట్లు తెలిపారు.

వెటర్నరీ అసిస్టెంట్‌గా పదోన్నతి

కూడేరు: మండలంలోని గొటుకూరు సచివాలయంలో పశుసంవర్ధక ఏహెచ్‌ఏగా విధులు నిర్వర్తిస్తున్న సుబహాన్‌కు వీఏ(వెటర్నరీ అసిస్టెంట్)గా పదోన్నతి లభించింది. పదోన్నతిపై గార్లదిన్నె మండలానికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. దీంతో ఆయన సోమవారం రిలీవ్ అయ్యారు. పదోన్నతి పొందిన సుబహాన్‌ను పశువైద్య శాఖ, సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

అనంతపురం క్రైం: స్థానిక చంద్రబాబు నాయుడు కొట్టాలకు చెందిన లక్ష్మన్న అనే యువకుడు బ్లేడుతో గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సోమవారం వెలుగుచూసింది. లక్ష్మన్న చాలా కాలంగా బొప్పాయి కూలీల మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పెళ్లి చేసుకోవాలని తల్లి ఒత్తిడితెస్తుండడంతో మానసికంగా ఇబ్బంది పడుతున్న అతను.. సోమవారం తెల్లవారుజామున బ్లేడుతో గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు.

అధికారుల్లో 'స్పందన'కరువు

ఆత్మకూరు: ప్రజాసమస్యల పరిష్కారానికి స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు అధికారులు డుమ్మా కొట్టారు. అధికారులు రిజిష్టర్‌లో సంతకాలు చేసి, వెళ్లారు. ప్రజలు సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన ప్రజలు.. అధికారులెవరూ లేక వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది.

రక్తదాన శిబిరం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో మానవతా రక్తదాతల సంస్థ, హెడీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, డీన్ సాయి కిశోర్ చైతన్య టీపీఓ రంజిత్‌రెడ్డి, మానవతా సంస్థ కన్వీనర్ అమర్ నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీకేఎస్‌లో స్కూటర్ యాత్ర

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో స్కూటర్ యాత్రను నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా వ్యవసాయ రంగంలో వెనుకబడిందన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.

ఆధ్యాత్మికతతో మనసుకు ప్రశాంతత


- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అనంతపురం/కల్చరల్: శాస్త్ర విజ్ఞానం సమ్మిళతమైన ఆధ్యాత్మికతతోనే మనసుకు ప్రశాంతత లభిస్తుందని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. పురాణ ఇతిహాసాలు, శాస్త్రాలపై మూఢనమ్మకాలు అనే అపోహ ఉందని, అది ఎంతమాత్రం సరికాదన్నారు. దైవంపై ఉన్న భక్తివిశ్వాసాలు మనపై మనకు నమ్మకం పెంచే సాధనాలుగా చూడాలన్నారు. ధర్మవర్ధిని ట్రస్టు ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో అనంతపురంవాసులకు రెండురోజులపాటు 'మాతృ చతుష్టయం' పేరిట ధర్మప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చాగంటి 'సాక్షి'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

మాది సాధారణ కుటుంబం..

మాది ఏలూరు. అక్కడే నా బాల్యం, చదువు సాగింది. నాన్న సుందర శివరావు, అమ్మ సుశీలమ్మ హైందవ ధార్మిక జీవితం గడిపేవారు. మా కుటుంబ నేపథ్యంలో ఎవరూ ప్రవచన కర్తలు లేరు. అమ్మానాన్నల సాధారణ జీవిత విధానమే మాలోనూ భాగమైంది. వారి బోధనలు, నాలోనూ ఆధ్యాత్మికత వైపు నడిపించాయి. నాన్న శంకర శతకం రచించారు. అమ్మ సుశీలమ్మ కూడా ఎంతో మందికి మంచి విషయాలు బోధించిన వ్యక్తి. బహుశా ఆ ప్రేరణ నాలోనూ ఉండొచ్చు. కానీ నేనేమీ ప్రత్యేకంగా సాధన చేయ లేదు. భగవంతుడిపై ఉన్న అచంచల భక్తి విశ్వాసాలు ఉన్న ఎవరికైనా ఇదంతా సాధ్యమనడంలో సందేహం లేదు. అలవోకగా వేల సంఖ్యలో పద్యాల ధారణ ఎలా సాధ్యమని అందరూ అడుగుతుంటారు.అమ్మానాన్నల ప్రేరణే ఇరవై ఏళ్లుగా ప్రవచనాలు చేయడానికి దోహదపడింది.

భార్య సహకారం మరవలేనిది : సాధారణంగా ఏ గృహిణి అయినా, వ్యక్తులైనా ఆడంబరాలు కోరుకుంటారు. కానీ అదృష్టవశాత్తూ నా సతీమణి సుబ్రహ్మణ్యేశ్వరికి సాధారణ జీవితం ఇష్టం. వ్యవసాయశాఖలో ఉద్యోగం చేసి, ఉద్యోగ విరమణ చేసింది. ఉన్నంతలో జీవితం గడపడం ఆమెకు ఇష్టం. నేను కూడా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ స్థాయిలో ఉద్యోగ విరమణ చేశా. మా కొడుకు షణ్ముఖ చరణ్, కూతురు నాగశ్రీవల్లి ఇద్దరూ ఇంజినీర్లుగా చేస్తున్నారు. వారు కూడా సాధారణ జీవితం గడపడానికి ఇష్టపడుతున్నారు. కొడుకు, కూతుళ్లకు కవల పిల్లలు సంతానం. అందుకే నేను కోరుకున్నదానికంటే అధికంగానే ఇచ్చిన భగవంతుడి ఆదేశం మేరకు ప్రవచనాలు ఉచితంగా చెప్తున్నాను.



మాట్లాడుతున్న చాగంటి కోటేశ్వరరావు

మనిషికి ఎంత అవసరమో గ్రహించాలి :

నా వరకు ప్రవచనాలు ఉచితంగానే చెపుతాను. నేను నిర్వాహకుల నుంచి ఏమీ ఆశించడం ఉండదు. సమాజ హితం కోరుకునే మనకు భగవంతుడు అన్ని విధాలా ఇస్తున్నప్పుడు అంతకంటే ఎక్కువ కోరుకోవడం అనవసరం అనేది తెలుసుకుంటే అసంతృప్తి ఎవరికీ ఉండదు. ఉన్నంతలో సర్దుకుపోవడం నేర్చుకోవాలి.

ధర్మవర్ధిని ట్రస్టు ద్వారా సేవలు..

తన కుమారుడు షణ్ముఖ చరణ్ అధ్యక్షుడిగా ధర్మవర్ధిని ట్రస్టు ఏర్పాటు చేసుకున్నాం. అయితే కొంతమంది ఇది ఫండ్‌రైజింగ్ కోసం అనుకునే ప్రమాదం ఉందని, చాలా చోట్ల పారదర్శకంగా ఉండాలన్నది మేము పెట్టుకున్న నియమం. చాలా చోట్ల నిర్వాహకులు అడిగిన అంశాలపైనే ప్రవచనం చేయాల్సి ఉంటుంది. తల్లిని పూజించడం, గోమాతను గౌరవించడం ప్రధానంగా మేము చేపడుతున్న కార్యక్రమాలు.

స్వీయ నియంత్రణే మార్గం :

'సోషల్ మీడియా ద్వారా ఎంత మంచి ఉందో అంత చెడు కూడా ఉంది. మనకు అవసరమైన వాటిని మాత్రమే తీసుకుని, ప్రమాదకరమనుకున్న వాటిని వదిలేస్తుండాలి. యువత ఎక్సలేటర్ మాత్రమే చూడకుండా చెడును ఆపే బ్రేకులు ఉపయోగించుకోవడమూ నేర్చుకోవాలి అని తెలిపారు.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్లు (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా



నజ్ముల్ షకీబ్



అసలంక

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీ ఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజీమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్మదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజీమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజీమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్మదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజీమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజీమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజీమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1. **బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్మదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజీమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావోపాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికే అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా



రవితేజ

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.



అనుష్క

అనుష్క @ 50

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.



కమల్ హాసన్

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.



ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ – ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. • ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. • త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ- ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.



బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.



గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం



సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగళ్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

- దర్శకుడు మారేష్ శివన్



''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ–''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.